# బుద్ధి

మినీకథ



సంజయకుమార్

“శేఖర్” అంటే తెలిసిన వాళ్ళు చాలా మంది డేరింగ్ మేన్ అంటారు. అమ్మాయిల్ని అల్లరి చేయడంలో గాని, బస్సుల్లో, సినిమా హాల్లో అమ్మాయిల ప్రక్క చేరిపోవడంలోగాని మంచి దిట్ట అనిపించుకున్నాడు.

ఎంతో మందిని ఏడిపించాడు. ఎంతో మంది ఉసురుపోసుకున్నాడు. “అలా అల్లరి పెట్టొద్దని” చాలా మంది చెప్పారు. అయినా విన్లేదు. వారానికి ఏడు సినిమాలు, గంటకు అరవై బస్సులెక్కే శేఖర్-

ఆరోజు సినిమాకెళ్ళాడు. హాల్లో ఓ మూల కుర్చొని తన ముందు సీట్లో ఏ అమ్మాయి కుర్చొంటుందా అని ఎదురు చూస్తున్నాడు. ఈ లోగా ఆట బిగినయింది. ప్చ్... అను కొన్నాడు. అంతలో ముగ్గురమ్మాయిలొచ్చి శేఖర్ ముందు సీట్లో కుర్చొన్నారు. ఈ రోజు చాన్స్ కొట్టేశానే అనుకున్నాడు. తన ప్రక్క సీటుల్లో ఎవరూ లేరు కాబట్టి ఫర్వా లేదనుకొని ముందు సీటును కాళ్ళతో తన్నాడు.

ఆ...అమ్మాయిల పేర్లు “ఆ...ఈ... ఊ...”లు

“ఆ-ఓరగా వెనుక్కి చూసింది. శేఖర్ నవ్వు కొన్నాడు. ముఖం తిప్పేసింది. మెల్లగా సీటు మీద చెయ్యేశాడు. “ఆ” చేతిపై తల నానించింది. శేఖర్ వంట్లో ఏదో పులకరించింది. రెండో చేతిని కూడా వేశాడు. “ఆ” యథాస్థానంలోనే వుంది. చేతులను “డవున్” చేశాడు. రెండు చేతులపై వీపు ఆనింది. శేఖర్ తనలో ఏదో అయిపోయాడు.

“ఆ” అమ్మాయి లూజ్ కేరెక్టర్ అనుకొని కుడి చేత్తో గిల్లాడు. ఆమె ఊరుకొంది. ఎడమ చేయిని భుజం మీద వేసి ...తర్వాత అలా మెడ క్రిందకు... ఇంకా పోనిచ్చాడు ఇంకా... ఎక్కున ఆగిపోయింది. శేఖర్ చేయిని పట్టు కొంది. గట్టిగా నొక్కింది. మెత్తగా, మత్తుగా అనిపించింది.

ఇలాంటి అమ్మాయిని ఎప్పుడూ చూళ్లేదు. ఎంత వేగం చెయినందుకొంది” అని అను కొన్నాడు. కుడి చేయిని చంకలోంచి...అలా... అటువేపు...ఇంకా ముందుకు వెళ్ళబోయి ఆగి పోయింది. రెండవ చేయిని గట్టిగా నొక్కింది. స్వర్గంలో తేలిపోయాడు. “ఆ” చేతుల్లో, శేఖర్ చేతులు పరవశమైపోయాయి. కొంత సేపటికి...రెండు చేతుల్తో పట్టేయాలనుకున్నాడు కాని తన ఎడమ చేయి ముందుకు రాలేదు.

గట్టిగా లాగాడు......“త్రాడు” ఎడమ చేయికి త్రాడు బిగించబడింది. ఆశ్చర్యంతో ఆత్రుతగా చేయిలాగాడు గాని రాలేదు.

శేఖర్‌కు అర్థమయింది. “ఆ” అమ్మాయి త్రాడుతో కట్టిందని “ఏమిటీపొగరు? దీని అంతు తేలుస్తా” అని భుజం మీద చెయ్యేసి తోసేశాడు. క్రింద పడిపోయింది “ఆ”......

ఏమిటీ సెన్స్ లేకుండా అన్నారు “ఈ...ఊ”లు.

శేఖర్‌కు భయం వేసింది. ఆ రెండు గొంతులు విన్నవే. చీకట్లో మనుష్యులు కనిపించడం లేదు.

సినిమా అయిపోయింది. లైట్లు వెలిగాయ్.

“ఆ...ఈ...ఊ...”లను చూసి శేఖర్‌కు చెమటలు పట్టాయ్. చలి జ్వరమొచ్చినట్టు... వణకసాగాడు.

“ఆ”...మావయ్య కూతురు “ఆదిత్య”

“ఈ... పిన్ని కూతురు “ఈశ్వరి”

“ఊ”...ఆదిత్యస్నేహితురాలు “ఊర్వశి”.

“చూడు మామయ్యా! లోకంలో అంతా నీ వాళ్ళు కాక పోయిన, నీ వాళ్ళలాంటి వాళ్ళు వుంటారు. ఈ రోజు చీకట్లో నన్ను ఏదో చేసెయ్యాలనుకున్నావ్. రేపు అదే చీకట్లో ... “ఈశ్వరే” వుంటే...అలాగే చేస్తావా! నిజంగా చేస్తావ్...

“బుద్ధి తేచ్చుకో మామయ్యా. ఎంతో మంది అమ్మాయిలు మాతో చెప్పారు. ఇంకా చెప్పని వాళ్ళెంత మందో...? అందర్నీ సమానంగా గౌరవించు. పరాయి ఆడదాని మీద పడిపోకు. నీ “ఈశ్వరి”కి నువ్వెలాగో ఆ... ఆడది కూడా. ఓ “అన్నయ్య”కు అలాగే” అని చెప్పింది ఆదిత్య.

“అన్నయ్యా నీతో ఎన్నో సార్లు చెప్పాను యిలా చెయ్యొద్దని. అయినా నువ్వు మానలేదు. అందుకే ఈ “ఎత్తు” వేశాం.” ఆదిత్య కుర్చీలో నేనేవుంటే నువ్వు చేతులతో అలా తాకుతుంటే... భరించగలనా! అన్నయ్యా...” అంటూ ఏడ్చింది ఈశ్వరి.

“ఏవండీ! మీరొక్కరే కాదు చాలా మంది వున్నారు. వాళ్ళకు బుద్ది చెప్పే వారు లేక మరీ రేగిపోతున్నారు “ఆదిత్య” కుర్చీలో నేనే వుంటే! మీరే అలా చేస్తుంటే ...లెంప వాయించి చెప్పుతో కొట్టేదాన్ని గుర్తుంచుకోండి. మీ అమ్మ, నాన్నలు బయట వున్నారు. వచ్చి త్రాడు విప్పుతారు” అని ఊర్వశి అనగానే ముగ్గురూ బయటకు నడిచారు.

శేఖర్ చలనం లేనట్టు వుండిపోయాడు.